క్లుప్తంగా

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక


డి. శారోన్

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని నమిలిగొండ శివారు ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థిని డి.శారోన్ బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ శ్రీకాంత్ శుక్రవారం తెలిపారు. ఘన్‌పూర్‌కు చెందిన శారోన్ 2024లో మోడల్ స్కూల్‌లో పదో తరగతి పూర్తి చేసిందని, 9.7 జీపీఏ సాధించినట్లు తెలిపారు. పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపడంతో పాటు బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడంతో శారోన్‌ను ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు అభినందించారు.

దేవరుప్పుల మండలం నుంచి..


శ్రావణి


దీపక్


అనూష

దేవరుప్పుల: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన నలుగురు విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు మండల నోడల్ అధికారిణి కళావతి తెలిపారు. మండలంలోని కడవెండి హైస్కూల్‌కు చెందిన భోనగిరి శ్రావణి, మాధాపురం హైస్కూల్‌కు చెందిన గుర్రం దీపక్, పెద్ద మడూరుకు చెందిన గజ్జి అనూష, సింగరాజుపల్లి హైస్కూల్‌కు చెందిన బెల్దె సాహితి ఎంపిక కావడంపై ఉపాధ్యాయులు, యాజమాన్య కమిటీలు హర్షం వ్యక్తం చేశాయి.

నెల్లుట్లకు చెందిన..


కృష్ణప్రసాద్

లింగాలఘణపురం: మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్ విద్యార్థి నెల్లుట్లకు చెందిన మోటె సేతు కృష్ణప్రసాద్ బాసర ఐఐటీకి ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ పుష్పకుమారి తెలి పారు. సేతు కృష్ణప్రసాద్ బాసరకు ఎంపిక కావడంతో ఉపాధ్యాయ బృందం అభినందించారు.

మల్లంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి..


అంజలి, పల్లవి

పాలకుర్తి: మండలంలోని మల్లంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు బాసరలో ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. గురువారం పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ కె. అంజలి, బి.పల్లవిలు బాసర ట్రిపుట్ ఐటీకి ఎంపికయ్యారని తెలిపారు. కాగా, విద్యార్థులను ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, మధూకర్, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, ప్రతిభ అభినందించారు.

గీత కార్మికుడికి గాయాలు

బచ్చన్నపేట: ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి మండల కేంద్రానికి చెందిన గీత కార్మికుడికి గాయాలయ్యాయి. మండల కేంద్రానికి చెందిన గీత కార్మికుడు బాల్‌నర్సయ్య గౌడ్ రోజుమాదిరిగా తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడటంతో గాయాలయ్యాయి. వెంటనే తోటి కార్మికులు జనగామ ఏరియా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం బాల్ నర్సయ్యను తరలించారు. కుడి కాలు విరిగి తీవ్ర గాయాలవడంతో జనగామలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం కోసం చేర్పించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని పలువురు నాయకులు కోరారు.

బాధ్యతల స్వీకరణ



చిల్పూరు: ఎంపీపీల పదవీ కాలం ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చిల్పూరు మండల పరిషత్ ప్రత్యేక అధికారిగా జిల్లా మైనింగ్ ఏడీ గుర్రం విజయ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. ఎంపీడీఓ, ఎంపీఓతో సమన్వయంతో పనిచేస్తానని తెలిపారు. ప్రజలకు మండల పరిషత్‌కు సంబంధించిన సమస్యలుంటే 9849110279లో సంప్రదించవచ్చని అన్నారు. సూపరింటెండెంట్ కృష్ణ, సంతోష్, జూనియర్ అసిస్టెంట్ నిఖిల్, రావుల రాజేశ్వర్, మహేందర్ అటెండర్ భాగ్యలక్ష్మి, టీఏ కుమారస్వామి పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

జఫర్‌గఢ్: మండలంలోని కూనూర్ గ్రామంలో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు స్థానిక ఎస్సై రవియాదవ్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూనూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కొంత మంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారని అందిన విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించి ముగ్గురు వ్యక్తులను పట్టుకోవడంతో పాటు వారి నుంచి రూ.12,660 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పేకాట ఆడుతున్న వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

భూకబ్జా నుంచి విముక్తి కలిగించండి

దేవరుప్పుల: భూకబ్జా నుంచి విముక్తి కలిగించాలని చిన్నమడూరు గ్రామ అసైన్డ్ పట్టాదారుల లబ్ధిదారులు కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో ఏఓ రవీందర్‌కు వినతి పత్రం అందజేశారు.

అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు కీలకం

జెడ్పీ సీఈఓ అనిల్ కుమార్


మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ అనిల్ కుమార్

పాలకుర్తి/పాలకుర్తి టౌన్: గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకమని జెడ్పీ సీఈఓ అనిల్ కుమార్ అన్నారు. శుక్రవారం పాలకుర్తిలో పదవీ కాలం ముగిసిన ఎంపీపీ నాగిరెడ్డి, జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ మదార్, ఎంపీటీసీల ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఎంపీడీఓ రాములు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీ సీఈఓ మాట్లాడారు. నిస్వార్థంతో ప్రజా సేవ చేసిన ప్రజాప్రతినిధులను ప్రజలు గుర్తుపెట్టుకుంటారన్నారు. అనంతరం ప్రజాప్రతినిధులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఓ మొగులప్ప, కొడకండ్ల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, గంటా రవీందర్, మాజీ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


నవీన్‌కు నగదు అందజేస్తున్న క్లబ్ బాధ్యులు

దేవరుప్పుల: నాణ్యమైన విద్యాబోధనతోపాటు ఉచిత వసతులు కల్పిస్తున్న ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ 320 ఎఫ్ గవర్నర్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య అన్నారు. శుక్రవారం మండలంలోని కోలుకొండ హైస్కూల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ దేవరుప్పుల శాఖ మర్రి అరవింద్ రెడ్డి విద్యానిధి ద్వారా పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థి భూక్య నవీన్‌కు రూ.10వేల నగదు పారితోషికాన్ని అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం విష్ణు, లయన్స్‌వైస్ గవర్నర్ ఎం సుధాకర్ రెడ్డి, రీజినల్ చైర్మన్ కలవల భాస్కర్ రెడ్డి, బజ్జూరి వేణుగోపాల్ మర్రి పట్టాభిరామరెడ్డి, ఈదునూరి నరసింహారెడ్డి బూతుక్కార్ అశోక్ రెడ్డి, గోలి పెద్ద ఉప్పల్ రెడ్డి, చిన్న ఉప్పల్‌రెడ్డి, గడ్డం సత్యనారాయణరెడ్డి, పెద్దాపురం వెంకటేశ్వర శర్మ, ఉపాధ్యాయుడు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో పర్మనెంట్ వార్డెన్లను నియమించాలి


ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న చిరంజీవినాయక్

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్‌పరిధిలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలబాలికల వసతిగృహాల్లో పర్మనెంట్ వార్డెన్లను నియమించాలని బీఆర్‌ఎస్వీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ లకావత్ చిరంజీవినాయక్ కోరారు. ప్రభుత్వ వసతిగృహాలకు పర్మనెంట్ వార్డెన్లను నియమించాలని కోరుతూ స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ డీఎస్ వెంకన్నకు శుక్రవారం ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ వసతిగృహాలకు పర్మనెంట్ వార్డెన్లు లేక ఇన్‌చార్జ్ వార్డెన్లతో నిర్వహిస్తున్నారని, దాంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వార్డెన్లు స్థానికంగా ఉంటూ నిత్యం విద్యార్థులకు అందుబాటులో ఉండాల్సి ఉండగా ఇన్‌చార్జ్ వార్డెన్లు కావడంతో హాస్టల్‌కు ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. దాంతో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందడం లేదని, హాస్టల్‌లో నెలకొన్న సమస్యలు పట్టించుకునే వారు లేకుండా పోయారన్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో ఇన్‌చార్జ్ వార్డెన్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుని తెలిపారు. ఇప్పటికైనా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ నాయకులు మాలోతు రోహిత్, సునీల్ పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనులు ప్రారంభం


డ్రెయినేజీ పనులను పరిశీలిస్తున్న ఎంపీటీసీ నర్సింహులు తదితరులు

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్‌కేంద్రంలోని 16వ వార్డులో డ్రెయినేజీ నిర్మాణ పనులను మాజీ ఎంపీటీసీ గన్ను నర్సింహులుగుప్తా శుక్రవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ 16వ వార్డులో దాదాపు రెండు దశాబ్దాలుగా డ్రెయినేజీ సమస్య తీవ్రంగా ఉందన్నారు. పాత బరోడా బ్యాంకు కాలనీ వాసులు, 16వ వార్డు ప్రజల కోరిక మేరకు ఈ పనులను చేపడుతున్నట్లు తెలిపారు. మండల పరిషత్, గ్రామ పంచాయతీ నిధులు రూ. 6.5లక్షలతో పనులను చేస్తున్నామన్నారు. త్వరితగతిన పనులను పూర్తి చేసి వార్డులో నెలకొన్న డ్రెయినేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా కృషి చేస్తానని తెలిపారు. మాజీ ఎంపీటీసీ మునిగెల రాజు, నాయకులు సిరిగిరి శ్రీనివాస్, పొదల రవి, గట్టు ప్రశాంత్, సురేందర్, పొన్న వెంకటయ్య, రమేశ్ పాల్గొన్నారు.

నిరుద్యోగుల సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం


జఫర్‌గఢ్: నిరసన తెలుపుతున్న నాయకులు

జఫర్‌గఢ్: నిరుద్యోగుల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వ ఏ మాత్రం పట్టించుకోవడం లేదని బీజేపీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేష్‌గౌడ్ అన్నారు. టీజీపీఎస్సీ కార్యాలయం ముట్టడి సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు ముందస్తు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో నాయకులు బుర్ర తిరుపతిగౌడ్, గడ్డం లింగస్వామి, గోదారి సాయిరాం, మోడెం అరవింద్ గౌడ్, కొనకటి నాగరాజు, పల్లె సంతోష్‌రెడ్డి, లింగ యాదవ్ ఉన్నారు.

ఆలయ భూమిని పరిరక్షించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలోని బస్టాండ్ సమీపాన ఉన్న తిరుమలనాథస్వామి దేవాలయ భూమిని కబ్జాదారుల నుంచి పరిరక్షించాలని కోరుతూ వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నాయకులు కోరారు. ఈమేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా భజరంగ్‌దళ్ జిల్లా అధ్యక్షుడు గోనెల రమేశ్, విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు అందె వేణు మాట్లాడుతూ 641 సర్వేనంబర్‌లోని దేవాలయభూమిని కొందరు వ్యక్తులు అక్రమంగా అమ్ముకుని తప్పుడు పేపర్లతో రిజిస్ట్రేషన్లకు ప్రయత్నిస్తున్నారన్నారు. దేవాలయభూమిని కబ్జా చేసి అక్రమంగా విక్రయాలు చేస్తున్న వారిపై దేవాదాయ, రెవెన్యూశాఖ అధికారులు చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని, దేవస్థాన భూమిని పరిరక్షించాలని వారు కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ మండల అధ్యక్షుడు కె.సదానందచారి, కార్యదర్శి కత్తి శ్రీను, బజరంగ్‌దళ్ నాయకులు గుర్రపు అరవింద్, ఇనుగాల గణేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'రాహుల్ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి'


నిరసన తెలుపుతున్న నాయకులు

జనగామ రూరల్: పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ మాట్లాడుతూ హిందువులుగా చెప్పుకునే వాళ్లు 24 గంటలు విద్వేషాన్ని, హింసను, అబద్ధాలను వ్యాప్తి చేయడమే పనిగా పెట్టుకున్నారని చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని, హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని జనగామ హిందూ వాహిని నాయకుడు మంతెన మణికుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని సంజయ్‌నగర్ చమన్ వద్ద నిరసన తెలియజేశారు. పార్లమెంట్ సమావేశాల్లో హిందువులపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో పండుగ నరేష్, చందు, బొట్ల శ్రీకాంత్, ముదిగొండ ప్రశాంత్,ఇస్లావత్ శ్రీకాంత్, పడకంచి మహేష్, నగందుల పవన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో రెడ్ డే



చిల్పూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని 1,3 అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు గుర్రం నీనా, మంద రేణుక ఆధ్వర్యంలో శుక్రవారం రెడ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ దూలమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం అంగన్‌వాడీల్లో ప్రతీ వారం రంగులపై పిల్లలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా ఎరుపు రంగు బెలూన్లు తదితర వాటితో పిల్లలను ఆటలు ఆడించామన్నారు. కార్యక్రమంలో ఆయా స్వరూప తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి పుష్ప తులసీ దళాలతో అలంకరణ



చిల్పూరు: చిల్పూరు బుగులు వేంకటేశ్వరస్వామిని శుక్రవారం సందర్భంగా అర్చకులు రవీందర్ శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ ఉదయం స్వామివారికి పంచామృతం, చందనం, పలురకాల పుష్ప, తులసి దళాల అలంకరణ చేశారు. కార్యక్రమంలో ఈఓ భాగం లక్ష్మీప్రసన్న సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలి


పనులను పరిశీలిస్తున్న కొండల్‌రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా విరివిగా మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని శివునిపల్లి ప్రత్యేక అధికారి కొండల్‌రెడ్డి అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మండలంలోని శివునిపల్లిలో నిర్వహించనున్న మొక్కలు నాటే కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో మొక్కలను నాటేందుకు ఉపాధి హామీ సిబ్బందితో చేపడుతున్న పనులను స్వయంగా పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా కళాశాల ఆవరణలో వెయ్యి మొక్కలను నాటాలన్నారు. అధికారులు, సిబ్బంది, ప్రజలు ప్రతి ఒక్కరూ వన మహోత్సవం కార్యక్రమంలో బాధ్యతగా పాల్గొనాలని, మొక్కలను నాటడాన్ని యజ్ఞంలా చేపట్టాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమాదేవి, ఎంపీఓ సుధీర్, పంచాయతీ కార్యదర్శి తిరునగరి శ్రీకాంత్, ఏపీఓ ప్రేమయ్య, సునీత, రాజు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ శివారు నమిలిగొండలోని ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో బాలికల హాస్టల్‌లో ఖాళీగా ఉన్న వార్డెన్, అదనపు వంట మనిషి, నైట్ వాచ్‌వుమన్ పోస్టులను ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నింపుటకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీకాంత్, ఎస్‌ఓ స్వప్న ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తంగా ఖాళీలు 3 ఉన్నాయని, కేర్‌టేకర్(వార్డెన్) పోస్టుకు బీఈడీ పూర్తి చేసిన మహిళలు అర్హులని, నెలకు జీతం రూ.12,500 ఉంటుందన్నారు. నైట్‌వాచ్ ఉమన్‌కు 10వ తరగతి పాసైన మహిళలు అర్హులని, నెలకు వేతనం రూ.8,710గా, అదనపు వంటమనిషికి 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, నెలకు వేతనం రూ.6,500 ఉంటుందన్నారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు, నివాస ధ్రువీకరణ పత్రం, విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తులకు ఈనెల 9వ తేదీ చివరితేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. పూర్తి వివరాల కోసం 7995750420 నంబర్‌లో సంప్రదించాలని వారు సూచించారు.

పంటల వివరాలను నమోదు చేసుకోవాలి

బచ్చన్నపేట: మండలంలోని రైతులు వర్షాకాల సీజన్‌లో వేసిన పంటల వివరాలను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి విద్యాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఆయన మాట్లాడారు. రైతులు పట్టేదారు పాసుపుస్తకాల జిరాక్స్‌లను మండల విస్తరణ అధికారులకు అందజేసి ఏయే పంటలను ఎన్ని ఎకరాల విస్తీర్ణంలో వేశారో నమోదు చేసుకోవాలని అన్నారు.

నివాళి



రఘునాథపల్లి: మండలంలోని నిడిగొండ గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి తిప్పారపు జయమ్మ (65) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం విదితమే. కాగా, శుక్రవారం నిడిగొండలో జరిగిన దశదిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య కుటుంబసభ్యులతో కలిసి పాల్గొన్నారు. జయమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ వైకుమార్‌గౌడ్, తాటికొండ సురేష్ ఉన్నారు.

ఆర్థికసాయం



బచ్చన్నపేట: మండలంలోని కొన్నె గ్రామంలో నాలుగుకాళ్ల బాలమ్మ మృతి చెందింది. కాగా సామాజిక సేవాకర్త కోడూరి శివకుమార్‌గౌడ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల నిమిత్తం రూ.5వేల సాయం అందజేశారు. సిద్ధిరాములు, సోమయ్య, నాంపల్లి ఉన్నారు.

7న 'వేద'లో స్వర్ణప్రాశన

జనగామ రూరల్: ఈనెల 7వ తేదీన పుష్యమి నక్షత్రం సందర్భంగా పట్టణంలోని వేద ఆయుర్వేదిక్ పంచకర్మ వెల్‌నెస్ ఆస్పత్రిలో స్వర్ణప్రాశన శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ అంజిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

దండోరా రజతోత్సవాలను విజయవంతం చేయాలి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

జఫర్‌గఢ్: ఈ నెల 7వ తేదీన హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించబోయే దండోరా రజతోత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో సంఘం నాయకులు, కార్యకర్తలు రజతోత్సవాల కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కలకోట సురేందర్ మాట్లాడుతూ సంఘం ఆవిర్భావించినప్పటి నుంచి మాదిగలు, మాదిగ ఉపకులాలు ఎదుర్కొంటున్న సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కలకోట వంశీ, కలకోట చింటు, అనిల్, వివేక్, రాజేందర్, నవీన్, శ్రీకాంత్, మహేష్, విష్ణు, బన్నీ, పవన్, అంకిత్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ పట్టా దరఖాస్తును తిరస్కరించండి


నడవలేని స్థితిలో తన వద్ద ఉన్న ఆధారాలను చూపిస్తున్న దేవకృప

తరిగొప్పుల: తమ అంగవైకల్యాన్ని ఆసరాగా చేసుకుని తన వ్యవసాయభూమిని అక్రమంగా పట్టా చేసుకునేందుకు పెట్టుకున్న దరఖాస్తును కలెక్టర్ తిరస్కరించి న్యాయం చేయాలని మండలకేంద్రానికి చెందిన ఎర్రవెల్లి దేవకృప కోరారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలకేంద్రానికి చెందిన బండ సంతోష, చంద్రయ్య దంపతులకు సంతానం లేకపోవడంతో తాను 5 రోజుల పసిగుడ్డుగా ఉన్నప్పుడే సాదుకోవడానికి తెచ్చుకున్నారని, తన తల్లి బండ సంతోష పేరున మండలకేంద్రం శివారులో సర్వే నంబర్ 508/బి1లో 0.19, సర్వేనంబర్ 558/ఏ/1లో 0.19 గుంటల వ్యవసాయ భూమి ఉండగా సంతోష తదనంతరం వారసత్వంగా తన పేరిట పట్టా అయ్యిందని తెలిపారు. అట్టి భూమిని తనకు వరసకు మామ అయిన బండ భిక్షపతి అక్రమంగా పట్టా చేసుకునేందుకు యాటెల్లి సుదర్శనం, డీలర్ సామెలు, ఎర్రవెల్లి సిద్ధయ్యలతో చేతులు కలిపి పట్టా హక్కు సంబంధించిన జిరాక్సులను తనకు తెలియకుండా ఏమార్చి పట్టుకెళ్లడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేసింది. అట్టి జిరాక్సులతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవడం జరిగిందని తెలిపింది. తాను నడవలేని స్థితిలో ఉన్నానని, ఏ ప్రభుత్వ కార్యాలయాలకు తిరగలేని దీనావస్థలో ఉండి పత్రికా ముఖంగా జిల్లా కలెక్టర్‌ను వేడుకుంటున్నానని వాపోయింది. తనకు న్యాయం చేయాలని, అక్రమంగా పట్టా చేసుకునేందుకు ప్రయత్నిస్తున్న భిక్షపతిపై కఠినచర్యలు తీసుకోవాలని కోరుతోంది.

బీజేవైఎం నాయకుల ముందస్తు అరెస్ట్


బచ్చన్నపేట: పోలీసులు అరెస్టు చేసిన బీజేవైఎం నాయకులు

బచ్చన్నపేట/లింగాలఘణపురం: నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం రాష్ట్ర కమిటీ ఇచ్చిన కలెక్టరేట్ల ముట్టడి పిలుపుతో నాయకులు వెళ్లకుండా పోలీసులు శుక్రవారం ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అక్రమ అరెస్టులు కాంగ్రెస్ పార్టీ అసమర్థ పాలనకు నిదర్శనమన్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో నాయకులు బంగారు మహేష్, మంచాల రాజశేఖర్, కక్కర్ల గణేష్, కంటెం భాస్కర్, పురాణం రాంబాబు, కిషన్, కుమ్మరాజు సందీప్, జుటు యాకేష్, లింగాల ఆదిత్య తదితరులు ఉన్నారు. అనంతరం వారిని సొంత పూచికత్తుపై విడుదల చేశారు.

పార్టీలకతీతంగా తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ


మాట్లాడుతున్న గ్రామస్తులు

దేవరుప్పుల: రాజకీయ పార్టీలకతీతంగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించుకుంటామని కామారెడ్డిగూడేనికి చెందిన రాజకీయ పార్టీల నేతలు స్పష్టం చేశారు. శుక్రవారం ఆ గ్రామంలోని దళిత కాలనీలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని తొలగించే యత్నంతో బీఆర్‌ఎస్ నాయకులు క్షీరాభిషేకం చేసి నిరసన తెలిపారు. దీంతో గ్రామ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు కలిసి సమన్వయ సమావేశం నిర్వహించుకుని పరిష్కార దిశలో కొలిక్కివచ్చారు. ఈ విషయమై కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మండల నాయకులు ఓడపల్లి రవీందర్, చింత రవి మాట్లాడుతూ విగ్రహ ఏర్పాటులో ఏర్పడిన సమన్వయలోపాన్ని సవరించుకుని ఈ సమస్య మా గ్రామానికి సంబంధించినదిగా భావించి పరిష్కరించుకుంటామన్నారు. త్వరలో విగ్రహాన్ని ఆవిష్కరించి నెలకొన్న వివాదానికి ఫుల్‌స్టాప్ పెడుతామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు ఆవుల సుధంజన్‌రెడ్డి, మొలుగూరి రమేష్, ఓడపల్లి, పుల్లయ్య, బీఆర్‌ఎస్ నాయకులు బిల్లా యాదవరెడ్డి, చింత సోమయ్య, లక్ష్మయ్య, మరాటి కృష్ణ గుండె రమేష్, బీఎస్పీ మండల నాయకుడు చింత ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై గుంత



బచ్చన్నపేట: మండలంలోని తమ్మడపల్లి సమీపంలో కల్వర్టు వద్ద రోడ్డు ఇటీవల చిరు జల్లులకు ధ్వంసమై గుంత ఏర్పడింది. దీంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. జాతీయ రహదారి ఇటీవలే నిర్మించడంతో వాహనాలు స్పీడ్‌గా వెళ్తున్నాయి. వాహనదారులు కల్వర్టు వద్దకు వచ్చాక గుంత కనిపించడంతో సడెన్‌బ్రేక్ వేసి అయోమయానికి గురవుతున్నారు. కుంగిన చోట హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి రహదారికి మరమ్మతు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.